మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: ఎస్‌ఐ

ముత్తారం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలకు యువకులు, గ్రామస్థులు దూరంగా ఉండాలని ముత్తారం ఎస్‌ఐ గోపతి నరేష్ సూచించారు. మండలంలోని అడవి శ్రీరాంపూర్‌లో మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు తీసుకొని యువత తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా ప్రలోభాలకు గురి చేస్తే 100 నంబర్‌కు గానీ, 1930కి గానీ ఫోన్ ద్వారా సమాచారం అందించాలని కోరారు. అవగాహన కార్యక్రమంలో గ్రామస్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పది ఫలితాల్లో 96.89 ఉత్తీర్ణత

- రాష్ట్రంలో 10వ స్థానంలో నిలిచిన జిల్లా
- మళ్లీ బాలికలదే పైచేయి
- జూన్ 3 నుంచి 13 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు



పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి ఫలితాల్లోనూ బాలికలే పైచేయి సాధించారు. బాలుర కంటే బాలికలు 0.57 శాతం మంది ఎక్కువగా ఉత్తీర్ణుల య్యారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పదో తరగతి ఫలితాలను బుధవారం విడుదల చేశారు. ఈ ఫలితాల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు 96.89 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో పదో స్థానంలో నిలిచారు. గత ఏడాది కంటే 0.57 శాతం ఉత్తీర్ణత పెరగగా, రాష్ట్రస్థాయిలో రెండు స్థానాల్లో వెనుకబడింది. మార్చి 21 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా జరిగిన పదో తరగతి వార్షిక పరీక్షలకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశా లలకు చెందిన 7,387 మంది విద్యార్థులు హాజరు కాగా, 7,157 మంది 96.89 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 3698 మంది బాలురకు గాను, 3,554 మంది 96.11 శాతం ఉత్తీర్ణులయ్యారు. 3,689 మంది బాలికలకు గాను, 3,603 మంది 97.67 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

సంవత్సరాల వారీగా ఫలితాలు..

సంవత్సరం	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణులైన విద్యార్థులు	శాతం
2023	7,927	7,332	92.49
2024	7,716	7,432	96.32
2025	7,387	7,157	96.89

ప్రభుత్వ పాఠశాలల విభాగంలో పెద్దపల్లి మండలం నిట్టూరు జడ్పీ స్కూల్‌కు చెందిన కె నిత్యామీనా 584 మార్కులు సాధించి జిల్లాలో టాపర్‌గా నిలిచారు. కమాన్‌పూర్ మండలం జూలపల్లి జడ్పీ స్కూల్‌కు చెందిన వైద్య శ్రీవరుణ్ 572 మార్కులు, జూలపల్లి మండల కేంద్రంలోని జూలపల్లి బాలుర పాఠశాల విద్యార్థి పి అశ్విత 568 మార్కులు సాధించారు.

- **59 ప్రభుత్వ విద్యాలయాల్లో వంద శాతం ఉత్తీర్ణత..**

పది ఫలితాల్లో జిల్లాలోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, వివిధ గురుకుల విద్యాలయాల్లో 59 పాఠశాలలు, గురుకులాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ధర్మారం మండలం జడ్పీ స్కూల్ నంది మేడారం, సాంఘిక సంక్షేమ శాఖ మల్లాపూర్ గురుకుల పాఠశాల, జడ్పీ దొంగతుర్తి, తెలంగాణ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల నందిమేడారం, జడ్పీ స్కూల్ నర్సింహులపల్లి, కొత్తూరు, కేజీబీవీ ధర్మారం, పాలకుర్తి మండలం కేజీబీవీ పాలకుర్తి, జడ్పీ స్కూల్ కుక్కల గూడూర్, జయ్యారం, పాలకుర్తి, రామ గుండం మండలం కేజీబీవీ రామ గుండం, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల రామగుండం, మైనార్టీ గురుకుల విద్యాలయం రామ గుండం, రామగిరి మండలం జడ్పీ స్కూల్ రామయ్యపల్లి, పెద్దపల్లి మండలం మైనార్టీ గురుకుల విద్యాల యం పెద్ద పల్లి, జడ్పీ స్కూల్ రాగినేడు, బాలుర పెద్దపల్లి, బాలికల పెద్దపల్లి, రాఘవా పూర్, నిట్టూర్, పెద్దబొంకూర్, మూల సాల, మారేడుగొండ, బీసీ గురు కులం రంగంపల్లి పాఠశాలల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధిం చారు. జూలపల్లి మండలం జడ్పీ స్కూల్ వడుకాపూర్, బాలికల పాఠశాల జూల పల్లి, ఎలిగేడు మం డలం జడ్పీ స్కూల్ ఎలిగేడు, ధూళికట్ట, సుల్తాన్‌పూర్, సుల్తానాబాద్ మండలం జడ్పీ స్కూల్ గర్రెపల్లి, బాలికలు సుల్తానాబాద్, బాలుర సుల్తానాబాద్, పూసాల, సాంబయ్యపల్లి, కనుకుల, కేజీబీవీ సుల్తానాబాద్, మోడల్ స్కూల్ సుల్తానాబాద్, బీసీ గురుకులం సుల్తా నాబాద్, ఓదెల మండలం జడ్పీ స్కూల్ ఓదెల, పొత్కపల్లి, కొలనూర్, న్యూ కనగర్తి, గుంపుల, కేజీబీవీ ఓదెల, కాల్వ శ్రీరాంపూర్ మండలం జడ్పీ స్కూల్ కూనారం, గంగారం, మంగపేట, మొట్ల పల్లి, పందిళ్ల, పెగడపల్లి, ముత్తారం మండలం జడ్పీ స్కూల్ ముత్తారం, పోతారం, ఖమ్మంపల్లి, కేజీబీవీ ముత్తారం, మంథని మండలం సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం మంథని, జడ్పీ స్కూల్ కన్నాల, కేజీబీవీ రామగిరి, కేజీబీవీ అంతర్గాం పాఠశాలల విద్యార్థులు వంద శాతం ఫలితాలను సాధించారు.

వివిధ పాఠశాలల వారీగా ఫలితాలు..

జిల్లాలోని వివిధ యాజమాన్యాల వారీగా ఫలితాల్లో బీసీ గురుకుల విద్యాలయాల్లో విద్యాభ్యాసం చేసిన 328 మందికి గాను 324 మంది ఉత్తీర్ణులయ్యారు. కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయాల్లో 424 మందికి గాను 420 మంది ఉత్తీర్ణులయ్యారు. మోడల్ స్కూల్లో 555 మంది విద్యార్థులకు గాను 543 మంది ఉత్తీర్ణులయ్యారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో 69 మందికి గాను 69 మంది పాసయ్యారు. మైనార్టీ గురుకుల విద్యాలయాల్లో 133 మం దికి గాను 133 మంది విద్యార్థులు, సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 452 మందికి గాను 449 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లల్లో 2,420 మందికి గాను, 2,260 మంది ఉత్తీర్ణుల య్యారు. ప్రైవేట్ పాఠశాలల్లో 3,012 మంది విద్యార్థులకు గాను, 2,950 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

రీ కౌంటింగ్ ఒక్కో సబ్జెక్ట్‌కు రూ. 500..

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయని డీఈవో మాధవి తెలిపారు. ఈ పరీక్షలకు మే 16వ తేదీ లోపు ఫీజు చెల్లించాలన్నారు. రీ కౌంటింగ్ కోసం ఒక్కో సబ్జెక్టుకు 500 రూపాయలు, రీ వాల్యూయేషన్, జవాబు పత్రాల నకలు కోసం ఒక్కో సబ్జెక్టుకు 1000 రూపాయలు చెల్లించాల న్నారు. రీ వాల్యూయేషన్, రీ కౌంటింగ్ కోసం ఫీజులు చెల్లించే వారు వాటి ఫలితాలు వచ్చే వరకు వేచి చూడ కుండా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష రాసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈవో సూచించారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి


దొంగతుర్తి కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

ధర్మారం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులకు కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. బుధవారం ధర్మారం మండలంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. మండలంలోని దొంగతుర్తి, ఖిలావనపర్తి, శాయంపేట, నందిమేడారం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైసు మిల్లులకు తరలించాలని సెంటర్ నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడా రైతులకు ఇంబ్బందులు కలగకుండా చూడాలని పేర్కొన్నారు. ఖిలావనపర్తిలోని పల్లె దవాఖానతో పాటు మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పైలెట్ ప్రాజెక్ట్ క్రింద బంజేరుపల్లి గ్రామంలో నిర్మిస్తున్న 71 ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట హౌజింగ్ పీడీ రాజేశ్వర్, తహసీల్దార్ ఎండీ వకీల్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

ఒకరి మృతికి కారణమైన నిందితుడికి 10 ఏళ్ల జైలు

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో మద్యం సేవించి అజాగ్రత్తగా వాహనం నడిపి ఒకరి మరణానికి కారణమైన కేసులో నిజామాబాద్‌కు చెందిన డ్రైవర్ షేక్ ఇసాక్‌కు 10సంవత్సరాల జైలుశిక్ష, రూ.20,500 జరిమానా విధిస్తూ జగిత్యాల అడిషనల్ సెషన్స్ కోర్టు జడ్జి నారాయణ బుధవారం తీర్పు వెలువరించారు. పట్టణానికి చెందిన సంకేత్ తన ద్విచక్ర వాహనం మీద ఇంటికి వెళ్తుండగా లారీ డ్రైవర్ షేక్ ఇషాక్ మద్యంసేవించి అతివేగంగా ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో సంకేత్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి మామ రాజశేఖర్ ఫిర్యాదుతో అప్పటి ఎస్ఐ సధాకర్ నిందితుడిపై కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు కానిస్టేబుల్ రంజిత్, సిఎంఎస్ కానిస్టేబుల్ ఎ.కిరణ్ కుమార్‌లు సాక్షులను ప్రవేశపెట్టగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జు.మల్లేశం తమ వాదనలు వినిపించారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి ఎస్.నారాయణ డ్రైవర్‌కు 10సంవత్సరాల జైలు శిక్ష, 20,500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన నాయిని వివేక్‌రాజ్(19)ను బుధవారం అరెస్ట్ చేశామని టౌన్‌సీఐ కె కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్‌లో వివేక్‌రాజ్ అనే యువకుడు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసుసిబ్బంది వెళ్లిపట్టుకొని విచారించామని ఆయన తెలిపారు. యువకుడివద్ద 50గ్రాముల గంజాయిని స్వాధీనంచేసుకొని కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

దాడిచేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు

శంకరపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం గద్దపాక గ్రామానికి చెందిన మ్యాకల రాకేష్ ఈనెల 22న వీణవంక గ్రామానికి చెందిన మాడ భగవాన్‌రెడ్డిని కర్రతో కొట్టాడు. దీంతో అతడి రెండు వేళ్లు విరిగిపోయాయి. భగవాన్‌రెడ్డి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. బుధవారం రాకేష్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రవి తెలిపారు.

ఆర్టీసీ బస్సు నుంచి పొగలు

● డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం

మల్లాపూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లానుంచి నిర్మల్‌జిల్లా ఖానాపూర్‌కు వెళ్తున్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు ఇంజన్ నుంచి బుధవారం పొగలు వచ్చాయి. బస్సు డ్రైవర్ గమనించి పక్కన నిలిపి అందులో ఉన్న125మంది ప్రయాణికులను కిందికి దిపాడు. కొంత సమయం బస్సును పక్కన నిలపడంతో బస్సునుంచి పొగలు ఆగిపోయాయి. దీంతోప్రమాదం తప్పిందని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

రూ.7500 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7500 పలికింది. బుధవారం మార్కెట్‌యార్డుకు నలుగురు రైతులు 40క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర రూ.7500, కనిష్ఠ ధర రూ.7200 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.



భవనం కోసం ముందుగా ప్రతిపాదించిన స్థలం

మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించిన శిలా ఫలకం

ముందుకు సాగని వ్యవసాయ కళాశాల పనులు

● ఏడాది క్రితం ప్రారంభించిన మంత్రి పొన్నం

● నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు

● ప్రతిపాదిత స్థలంలో సాధ్యం కాదని నిలిపివేత

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో నిర్మించ తలపెట్టిన మహాత్మా జ్యోతిబాపూలే బీసీ మహిళా వ్యవసాయ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. గతేడాది మార్చి15వ తేదీన మంత్రి పొన్నం ప్రభాకర్ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం స్థలం సమస్యతో కళాశాల భవన నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. నిర్మాణానికి 3 కోట్ల రూపాయల నిధులు మంజూరైనా మరో చోట పనులు ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 15 వ్యవసాయ డిగ్రీ కళాశాలలను ప్రారంభించింది. ఇందులో భాగంగా కరీంనగర్ జిల్లాకు మంజూరైన మహిళా కళాశాలకు మొగ్దుంపూర్ పూరేన్ గుట్ట ప్రాంతంలో 48 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. డీఎంఎఫ్‌టీ నిధులు రూ.1కోటి 30లక్షలతో గుట్ట చుట్టూ రెండున్నర కిలో మీటర్లు ప్రహరీ నిర్మించారు. భవ నిర్మాణానికి రూ.2.3కోట్ల అంచనాతో ఇంజనీరింగ్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీంతో మొదటి విడతలోనే 3 కోట్ల రూపాయలు మం జూరయ్యాయి. ఈ క్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గతేడాది పనులను ప్రారంభించగా ప్రతిపాదిత స్థలంలో భవన నిర్మాణం సాధ్యం కాదని కాంట్రాక్టర్ పనులను చేపట్టలేదు.

అనంతరం కళాశాల రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్‌లు స్థలాన్ని పరిశీలించి గుట్ట పైభాగంలో భవనం నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. గుట్ట పైకి ర్యాంప్ నిర్మించేందుకు రూ.20 లక్షల అంచనాతో ఎస్టిమేషన్ వేసి ప్రతిపాదనలు పంపించారు. ఇప్పటి వరకు నిధులు మంజూరు కాకపోవడంతో ఏడాది కాలంగా పనులు ప్రారంభానికి నోచుకోవడంలేదు. నిధులు మంజూరవగానే గుట్టపైకి ర్యాంప్ నిర్మాణంతోపాటు భవన నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

రాయమల్లు మృతి ఉద్యమానికి తీరనిలోటు

● పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి కుమారస్వామి

సుల్తానాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నాటి పీపుల్స్‌వార్ ఉద్యమ పార్టీలో ఈప్రాంత కీలక నేతలతో కలిసి పనిచేసిన బండి రాయమల్లు గౌడ్ మృతి తీరనిలోటని పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదనకుమారస్వామి అన్నారు. బండి రాయమల్లు గౌడ్ సంస్మరణ సభ పూసాల గ్రామంలో బుధవారం నిర్వహించారు. పౌర హక్కుల సంఘాలతోపాటు పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌరహక్కుల సంఘం సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి మాట్లాడుతు పోస్టర్లు అంటించడం నుంచి ప్రారంభం అయిన ఆయన జీవితం విప్లవోద్యమాలకు అనేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడంలో కీలకపాత్ర పోషించారన్నారు. అనేక ఎన్‌కౌంటర్ల నుంచి తప్పించుకని వచ్చిన ఉద్యమకారు లను వారి కుటుంబసభ్యులను కాపాడిన గొప్పవ్యక్తి బండి రాయమల్లు గౌడ్ అని కొనియాడారు. సంస్మరణ సభలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి మార్వాడి సుదర్శన్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య, భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పార్వతి, జిల్లా కో ఆర్డినేటర్ గాండ్ల మల్లేశం, భారత నాస్తిక సమాజం నేతలు బూపెల్లి సుదాకర్, బండి రాయమల్లు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



బండి రాయమల్లు సంస్మరణసభలో నివాళులర్పిస్తున్న పౌర, ప్రజాసంఘాల నేతలు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చందుర్తి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం మూడపల్లి బస్టాండ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. గ్రామస్థులు కథనం ప్రకారం.. ఇల్లంతకుంట మండలం పెద్ద లింగాపూర్ గ్రామం చెందిన నల్లగొండ శ్రీనివాస్ అనే యువకుడు బుల్లెట్ వాహనంపై చందుర్తి నుంచి వేములవాడ వైపు వెళ్తుండగా, కథలాపూర్ మండలం భూషణ రావుపేటకు చెందిన కారు డ్రైవర్ విష్ణువర్ధన్ వేములవాడ నుంచి భూషణరావుపేట వెళుతుండగా మూడపల్లి బస్టాండ్ వద్ద ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. చందుర్తి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

సన్నవరి విత్తనాలపై అవగాహన

చొప్పదండి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ రైతువేదికలో బుధవారం తెలంగాణ సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సన్నవరి విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. సన్నవరి రకాలైన బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638, జేజీఎల్ 27356, ఎంటీయూ 1262, దొడ్డు రకాలు ఎంటీయూ 1010, కెఎన్ఎం 118, జేజీఎల్24423, పెసర విత్తనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడ్ కార్పొరేషన్ మేనేజర్ విష్ణువర్ధన్‌రెడ్డి, సీడ్ ఆఫీసర్ జి మౌనిక, ఫీల్డ్‌ఆఫీసర్ మానస, అగ్రికల్చర్ ఆఫీసర్ వంశీకృష్ణ, ఏఈవో కవిత పాల్గొన్నారు.

సవాళ్లతో కూడుకున్నది పోలీస్ ఉద్యోగం: సీపీ

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సవాళ్లతో కూడుకున్న పోలీస్ ఉద్యోగాన్ని విజయవంతంగా పూర్తి చేయడం గొప్ప విజయమని సీపీ గౌస్ ఆలం అన్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ హోదాల్లో పనిచేసి బుధవారం పదవీ విరమణ పొందిన నలుగురు పోలీ సుఅధికారులను ఆయన సన్మానించారు. పదవీ విరమణపొందినవారిలో కరీంనగర్ అడిషనల్ డీసీపీగా పనిచేసిన ఎ లక్ష్మీనారాయణ, సీసీఎస్ ఏసీపీగా విధులు నిర్వహించిన పి.కాశయ్య, కరీంనగర్ ఎస్‌బీలో పనిచేసిన ఎస్ఐ వి.వెంకట్‌రెడ్డి, కరీంనగర్ ఏఆర్ విభాగంలో విధులు నిర్వహించిన ఏఆర్ ఎస్ఐ వి.బాలరాజు ఉన్నారు. కార్యక్ర మంలో రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్, ప్రొబెషనరీ ఐపీఎస్ వసుంధర, అడిషనల్ ఎస్‌పీ నరేందర్, ఇతర ఏసీపీలు, సీఐలతోపాటు ఆర్ఐలు శ్రీధర్‌రెడ్డి (సంక్షేమం), కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎస్ఐ మామిడి సురేందర్ పాల్గొన్నారు.



పదవీ విరమణ పొందిన అధికారులతో సీపీ గౌస్ ఆలం

రైతు ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని రైతు కొంగరి సత్యంరెడ్డి కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి బుధవారం ఆత్మహత్యకు యత్నించాడని స్థానికులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు అతన్ని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారని తెలిపారు. గ్రామంలోని రైతు సత్యంరెడ్డి వ్యవసాయంతో పాటు కోళ్ల పెంపకం చేపడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొంత కాలంగా కుటుంబంలో గొడవలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన సత్యంరెడ్డి మనస్థాపం చెంది పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడని తెలిపారు. ఘటన స్థలానికి చేరుకుని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మూడేళ్ల వయసు ఉన్న బాలుడు అస్వస్థతకు గురై సిరిసిల్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని స్థానికులు బుధవారం తెలిపారు. గ్రామంలోని ప్రవీణ్ కుటుంబం ఇటీవల దైవ దర్శనం కోసం తిరుపతికి వెళ్లారని పేర్కొన్నారు. బాలుడు అక్కడే అస్వస్థతకు లోనయ్యాడని చెప్పారు. అక్కడ ఆసుపత్రిలో చికిత్స అందించిన కుటుంబ సభ్యులు స్వగ్రామానికి చేరుకుని బాలుడిని సిరిసిల్లకు తరలించారని పేర్కొన్నారు. రెండురోజులుగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయాడని తెలిపారు.

బాలుడిపై పిచ్చికుక్క దాడి

ఇల్లందకుంట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని కనగర్తి గ్రామంలో చిన్నారిపై పిచ్చికుక్క దాడిచేసి గాయపర్చింది. గ్రామానికి చెందిన రామంచ రాజు-వనిత దంపతుల కుమారుడు అయాన్(2) ఇంటిబయట ఆడుకుంటున్న సమయంలో ఒక్కసారిగా పిచ్చికుక్క దాడిచేయగా తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బాలుడిని హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైనవైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్సఅందిస్తున్నారు. స్థానికులు మాట్లాడుతూ గ్రామంలోగతంలో కూడా పిచ్చికుక్కలు పలువురిపై దాడి చేశాయన్నారు. వెంటనే పిచ్చికుక్కల దాడి నుంచి గ్రామస్థులను కాపాడాలని అధికారులను కోరారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత



పర్సు అప్పగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద బుధవారం సాయంత్రం తీగలగుట్టపల్లికి చెందిన సాలగ్రామ శైలజ తన పర్సును పోగొట్టుకుంది. పర్సులో 1883 రూపాయల నగదుతోపాటు 3 తులాల బంగారు పుస్తెలతాడు ఉన్నాయి. అక్కడేవిధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్‌మహిళా కానిస్టేబుల్ వి.అశ్విని ఆ పర్సును వెతికి దొరకపట్టారు. అనంతరం ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో సీఐ కరీంఉల్లాఖాన్ సమక్షంలో యజమానురాలికి అప్పగించారు. ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి, కరీం ఉల్లాఖాన్ మహిళా కానిస్టేబుల్ అశ్వినిని అభినందించారు.

బస్సులో పర్సు మరచిపోయిన ప్రయాణికురాలు

● అప్పగించిన సిబ్బంది

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బస్సులో ఓ ప్రయాణికురాలు పర్సుమర్చిపోగా సిబ్బంది బుధవారం తిరిగి అప్పగించారు. జగిత్యాల డిపోకు చెందిన బస్సు వరంగల్‌కు వెళ్తుండగా కరీంనగర్‌లో సులోచన అనే ప్రయాణికురాలు ఎక్కి వరంగల్‌లో దిగిపోయింది. ప్రయాణికురాలు బస్సులో తన చిన్న బ్యాగు మరచిపోగా ఆ బ్యాగులో ప్రయాణికురాలికి చెందిన తులం బంగారు చైను, సెల్‌పోన్‌ను కండక్టర్ గంగాప్రసాద్ డిపోలో అప్పగించారు. బ్యాగులో ఉన్న ఆధారాలతో ప్రయాణికురాలికి సమాచారం అందించారు. ఆమె తగిన ఆధారాలతో రావడంతో డిసి మొండయ్య, కండక్టర్ గంగాప్రసాద్‌లు బ్యాగును ప్రయాణికురాలికి అప్పగించారు.

కాంట్రాక్ట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమ్మె తాత్కాలిక విరమణ

గణేశ్‌నగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో కాంట్రాక్ట్, పార్ట్‌టైం అసిస్టెంట్‌ప్రొఫెసర్లు బుధవారం తాత్కాలికంగా సమ్మె విరమించారు. మేలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టమైన హామీఇవ్వడంతో స్టేట్ అసోసియేషన్ బాడీనిర్ణయం మేరకు సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు తెలిపారు.

జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన జాహ్నవి



జాహ్నవి

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర జ్యూడిషియల్ సర్వీస్ గురువారం విడుదల చేసిన సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ఫలితాల్లో వేములవాడ పట్టణంలోని భీమేశ్వరా లయం వీధికి చెందిన సంకెపల్లి జాహ్నవి ఎంపికయ్యారు. వేములవాడ జవహర్ లాల్‌నెహ్రూ డిగ్రీకళాశాలలో బీకాం, ఉస్మానియాయూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ ఎం పూర్తిచేసిన జాహ్నవి 2018లో బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్ చేసుకొని వేములవాడ బార్ అసోసియేషన్‌లో సభ్యురాలిగా చేరారు. రాష్ట్ర జ్యూడిషియల్ సర్వీస్ నిర్వహించిన సివిల్ జడ్జి పరీక్షల్లో నాల్గవ ప్రయత్నంలో విజేతగా నిలిచారు. ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నారు. జాహ్నవి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడంపై ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్, బీజేపీ నాయకులు ప్రతాప రామకృష్ణ, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండరవి, ప్రధానకార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన తుమ్మన్నపల్లి యువతి



బత్తుల మానస

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మన్నపల్లి గ్రామానికి చెందిన బత్తుల మానస జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైంది. కేయూలో ఎల్ఎల్‌బీ పూర్తి చేసింది. ఇటీవల రాత పరీక్షనురాసి జూనియర్ సివిల్‌జడ్జి పోస్టుకు ఎంపికైంది. తుమ్మన్నపల్లి గ్రామానికి చెందిన యువతి జడ్జిగా ఎంపిక కావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు లాంఛనంగా 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్' ప్రారంభం

● నుస్తులాపూర్ గ్రామం నుంచి శ్రీకారం



తిమ్మాపూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో మేడే సందర్భంగా గురువారం ఉదయం 11.30గంటలకు ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారా యణ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అధికారుల బృందంతో అదునతన సౌకర్యాలతో సిద్ధం చేసిన వాహనంలో కలిసి వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడికక్కడే సత్వరం పరిష్కరించాలన్నదే ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. మానకొం డూర్ నియోజక వర్గంలోని ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను అక్కడే పరిష్కరిస్తే బాగుంటుందనే ఉద్దేశంతోనే ఈ ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమం రూపొందించామని తెలిపారు. దీంతో ప్రజలకు క్యాంపు కార్యాలయానికి వచ్చే పరిస్థితి తప్పుతుందన్నారు. బస్సుల్లో, ఆటోల్లోను తిరిగే అవసరం ఉండకుండా తానే పల్లెబాట పట్టనున్నట్లు తెలిపారు. ప్రత్యేకించి రూపొందించిన యాప్ ద్వారా నమోదైన సమస్యలను పరిశీలించి మండలాల వారీగా ఆయా గ్రామాలకు వాహనంలో అధికారులను వెంటబెట్టుకొని, ప్రజలు నివేదించిన సమస్యలను చర్చించి అక్కడికక్కడే పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమం కోసం వాహనాన్ని ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపారు. ఈ వాహనంలో కంప్యూటర్, ప్రింటర్, స్టేషనరీ, సౌండ్ సిస్టమ్‌తో పాటు ఇతరసౌకర్యాలు ఉంటాయన్నారు. ఫిర్యాదులు నమోదుచేయడానికి సిబ్బందిని అందుబాటులో ఉంటారని తెలిపారు. నమోదైన ఫిర్యాదులు పరిష్కారమైనా, కాకపోయినా వాటిస్టేటస్ తెలు సుకోవచ్చన్నారు. ఈ వాహనం ద్వారా వారంలో మూడురోజుల పాటు గ్రామాల్లో పర్యటిస్తానని అన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసువాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. కాగా ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి సీఎంను ఆహ్వానించడానికి మంగళవారం ఆయన హైదరాబాద్ వెళ్లారు. అక్కడ సీఎం ఎమ్మెల్యే చేపట్టిన కార్యక్రమానికి తమ సహాయసహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే కవ్వంపల్లిని అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మల్యాల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని మల్యాల క్రాస్‌రోడ్డు సమీపంలో మంగళవారం అర్ధరాత్రి ద్విచక్రవాహనం, ట్రాలీ వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. జగిత్యాలకు చెందిన వేల్పులమార్క్(21) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై జగిత్యాల నుంచి వేములవాడకు వెళ్తుండగా మల్యాల క్రాస్ రోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాలీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో మార్క్ తలకు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో జగిత్యాల నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తండ్రి పోచయ్య ఫిర్యాదు మేరకు ట్రాలీ డ్రైవర్ కరీంనగర్‌కు చెందిన కోన శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

కరీంనగర్ జిల్లాలో పలువురు తహసీల్దార్ల బదిలీలు

కరీంనగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో 12 మంది తహసీల్దార్ల బదిలీలు జరిగాయి. మంగళవారం రాత్రి కలెక్టర్ పమేలా సత్పతి బదిలీల ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తపల్లి తహసీల్దార్ ఎన్ రాజేశ్‌ను కరీంనగర్ రూరల్, తిమ్మాపూర్ తహసీల్దార్ కె .విజయ్‌కుమార్ మానకొండూరుకు, మానకొండూరు తహసీల్దార్ బి రాజేశ్వరి రామడుగుకు, రామడుగు తహసీల్దార్ ఆర్.వెంకటలక్ష్మి కొత్తపల్లికి, కరీంనగర్ రూరల్ తహసీల్దార్ సీహెచ్ రాజు జమ్మికుంటకు, జమ్మికుంట తహసీల్దార్ జి.రమేశ్ బాబు శంకరపట్నంకు, శంకరపట్నం తహసీల్దార్ బి.భాస్కర్ హుజూరాబాద్ ఆర్‌డీవో కార్యాలయానికి, హుజూరాబాద్ కార్యాలయంలో పనిచేస్తున్న కె.శ్రీనివాస్‌రెడ్డి తిమ్మాపూర్‌కు, కరీంనగర్ అర్బన్ తహసీల్దార్ జె.నరేందర్ గన్నేరువరం మండలానికి, గన్నేరువరం తహసీల్దార్ నరేందర్ కరీంనగర్ అర్బన్‌కు, సైదాపూర్ తహసీల్దార్ మంజుల వీణవంకకు, వీణవంక తహసీల్దార్ జి .శ్రీనివాస్‌ను సైదాపూర్‌కు, కలెక్టర్ కార్యాలయంలో సీ సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కాళీచరణ్‌ను జీ సెక్షన్‌కు, జీ సెక్షన్‌లో పనిచేస్తున్న ఎస్.శ్రీవాణీని సీ సెక్షన్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. 12 మంది ప్రస్తుతంపనిచేస్తున్న స్థానాల్లో ఏడాదికాలం కూడా పూర్తి చేసుకోలేదని కొందరు తహసీల్దార్లు పేర్కొంటున్నారు. ఒకచోట రెండేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న తరువాత ఏడాదిలోపు ఎక్కడికైనా బదిలీ చేయడం రెవెన్యూశాఖలో ఆనవాయితీగా ఉంటూ వస్తున్నది. ప్రస్తుతం బదిలీ అయినవారెవరూ పనిచేస్తున్న స్థానంలో ఏడాదికూడా ఉండలేదని, కేవలం రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే వీరిని బదిలీ చేశారని, రెవెన్యూశాఖ ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది.

ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ తెగి పడి వరిచేను దగ్ధం



చింతగుట్టలో దగ్ధమవుతున్న వరిచేను

శంకరపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతగుట్టలో బుధవారం ప్రమాదవశాత్తు విద్యుత్‌వైర్ తెగి మంటలు చెలరేగి వరిచేను దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. చింతగుట్టగ్రామానికి చెందిన ఆడెపు కొంరయ్య వరి కోసేందుకు నాలుగు రోజుల నుంచి హార్వెస్టర్ కోసం ఎదురు చూస్తున్నాడు. కాగా కోతకువచ్చిన వరిచేనులో ప్రమాదవశాత్తు విద్యుత్‌వైర్ తెగి పడి షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో సుమారుఎకరం వరి అగ్నికి ఆహుతైంది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ


క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు ఉదయం కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకొని పార్వతి రాజేశ్వరస్వామివార్లను దర్శించుకున్నారు.

ఒకే ఈతలో రెండు లేగదూడలు


లేగదూడలతో రైతు శ్రీనివాస్

గన్నేరువరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జంతువులలో ఆవులు, గేదెలు ఈతకు ఒక లేగ దూడకు మాత్రమే జన్మనిస్తాయి. అయితే గన్నేరువరానికి చెందిన పుల్లెల శ్రీనివాస్ అనే రైతుకు చెందిన ఆవు బుధవారం రెండు లేగదూడలకు జన్మనిచ్చింది. రెండు లేగదూడలు ఆరోగ్యంగా ఉన్నాయని రైతు సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

ఆయ్‌మారే మేడే

- కాగితాలకే పరిమితమైన కార్మిక చట్టాలు
- యథేచ్ఛగా సాగుతున్న శ్రమ దోపిడీ
- నేడు కార్మిక దినోత్సవం



ఐక్య ఉద్యమాలు నిర్వహించాలి

మిల్కూరి వాసుదేవరెడ్డి, సీపీఎం కరీంనగర్ జిల్లా కార్యదర్శి



కార్మికులు ఐక్య ఉద్యమాలతో హక్కులు కాపాడుకోవాలి. హమాలీ, బీడీ, గ్రానైట్, ట్రాన్స్‌పోర్టు, స్కీం వర్కర్ రంగాల్లో కనీస చట్టాలు అమలు కావడం లేదు. సీపీఎం అనుబంధ ట్రేడ్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల పక్షాన పోరాటాలు కొనసాగిస్తున్నాం.

మేడే స్ఫూర్తితో ఉద్యమించాలి

- కొయ్యడ సృజన్‌కుమార్, వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి

కార్మికులంతా మేడే స్ఫూర్తితో ఉద్యమించాలి. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారు. కనీస వేతన చట్టం అమలు కావడం లేదు. ఉపాధిహామీ పథకాన్ని ఎత్తివేసే కుట్రలు పన్నుతున్నారు.



సిరిసిల్ల/భగత్‌నగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కష్టం వారి జీవన ఆధారం.. శ్రమ శక్తే వారికి దారి.. వాళ్లు లేని ఏ రంగాన్ని ఊహించలేం.. అలాంటి కార్మికులకు అంతర్జాతీయ సంఘీభావం పలికే దినోత్సవం మేడే. ఎర్రజెండా చేత పట్టి ముందుకు సాగిన పోరాటానికి 139 ఏళ్ల నిండాయి. కార్మికులు తమ హక్కుల కోసం పోరాటాలను ఉధృతం చేస్తూ శ్రమదోపిడీ నుంచి శాశ్వతంగా విముక్తి కావాలన్న తమ అంతిమ లక్ష్యాన్ని గుర్తు చేసుకునే రోజు మేడే. ప్రపంచ కార్మికు లారా ఏకం కండి.. అని ఆనాడు మార్క్స్, ఎంగెల్స్ పిలుపునిచ్చి కార్మిక వర్గాల్లో చైతన్యాన్ని తీసుకువచ్చిన కార్మిక దినోత్సవానికి 139 ఏళ్లు. చికాగో నగరంలో పనిగంటల పరిమితి కోసం సాగించిన పోరాటంలో కార్మికుల రక్తంతో తడిసి ఎగిరిన ఎర్రజెండా ఇప్పటికీ కార్మికుల హక్కుల కోసం సాగే పోరాటా లకు నిరంతర పోరాట స్ఫూర్తినిస్తోంది.

ఎనిమిది గంటల పని దినం కోసం పెట్టుబడిదారి వర్గానికి, కార్మిక వర్గానికి శతాబ్దాల తరబడి సాగిన పోరాటంలో కార్మికులు సాధించుకున్న విజయం. 1886 మే 1న అమెరికాలోని చికాగో పట్టణంలో హే మార్కెట్ వద్ద కార్మికులు 18 గంటల పని దినాన్ని వ్యతిరేకిస్తూ ఎనిమిది గంటల పని కావాలని జరిపిన ప్రదర్శనపై అమెరికన్ పోలీసులు జరిపిన కాల్పుల్లో ఎనిమిది మంది కార్మికులు బలయ్యారు. ఆ రక్తంలో కార్మికుడి చొక్కా ఎర్రజెండాగా ఎదిగింది. 18 గంటలు 12 గంటలకు... ఆ తరువాత 8 గంటలకు చేరుకుంది. ఫ్యాక్టరీ చట్టాలు, మహిళా, బాల కార్మికులకు సంబంధించిన నిబంధనలు కూడా వచ్చాయి. చికాగో కార్మికులు ఉద్యమించిన రోజున అంతర్జాతీయ మే డే ఉత్సవంగా జరపాలని, రెండో ఇంటర్నేషనల్ పిలుపునిచ్చింది. రష్యాలో మొదటి సోషలిస్టు విప్లవం విజయం తరువాత ప్రపంచ వ్యాప్తంగా మే డే ఉత్సవం కార్మికుల పరిమితి పని గంటలే కాక.. కార్మికులు ప్రభుత్వాన్ని హక్కుల కోసం డిమాండ్ చేసే పరిస్థితికి చేరుకుంది. ప్రపంచ చరిత్రలో పనిగంటల పోరాటం విజయం సాధించినా మేడేను గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో కార్మిక సంఘాలు ఘనంగా జరుపుకోవడానికి ఏర్పాట్లు చేశారు.

● జిల్లా జనాభాలో సగానికి పైగా కార్మికులే...

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 5,52,037 జనాభా ఉండగా, 2 లక్షల 98వేల 663 మంది వివిధ పనులు చేసుకునే కార్మికులు ఉన్నారు. ఇందులో 1.58 లక్షలు పురుషులు, 1.40 లక్షలు మహిళలు ఉన్నారు. సిరిసిల్ల కేంద్రంలో మరమగ్గాల పరిశ్రమలో ప్రత్యక్షంగా పరోక్షంగా 25వేల మంది కార్మికులు పని చేస్తే బీడి పరిశ్రమలో 35వేల మంది కార్మికులు ఉన్నారు. వ్యవసాయ రంగంలో కూలీలుగా లక్షా 17వేల 37 మంది ఉండగా, పురుషులు 48,216, మహిళలు 53,521 ఉన్నారు. కుటీర పరిశ్రమల్లో 46,647 మంది ఉండగా 13,647 మంది పురుషులు, 33,000 మహిళలు ఉన్నారు. రోజువారీగా పనిచేసే కూలీలతో పాటు ఇతర రంగాల్లో ఉన్న గుమస్తాలాంటి పనులు చేసే కార్మికులు 83వేల 528 మంది ఉండగా, పురుషులు 54,533, మహిళలు 28,995 మంది ఉన్నారు.

వీరికి కనీసం కూలీ గిట్టుబాటు కాకపోగా కార్మిక చట్టాలు, సంక్షేమ పథకాలు అందకుండా కాలం వెల్లదీస్తున్నారు. జిల్లాలో కార్మికుల జీవితాలకు భద్రత లేకుండా పోయింది. లేబర్ అడ్డాలపై రోజు కూలీ దొరికితే కానీ కడుపు నింపుకోలేని కార్మికులు దర్శనమిస్తారు. బండెడు మోత మోసే హమాలీలకు భద్రత లేదు. ఏ ప్రమాదం జరిగినా వారిని పట్టించుకునే వారు ఉండరు. ముఖ్యంగా సిరిసిల్ల పవర్‌లూంలో పని చేసే నేతన్నలు 12గంటలు కష్టపడితేనే గానీ కుటుంబం గడవని పరిస్థితి ఉంది. ఒరిస్సాలాంటి రాష్ట్రాల నుంచి పిల్లలతో తరలివచ్చి ఇటుక బట్టీల్లో, చాలీచాలని జీతాలతో కార్మికులు మగ్గిపోతున్నారు. బీడీ పరిశ్రమలో మహిళా కార్మికుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంటుంది. మహిళా కార్మికుల ఇళ్లన్నీ కార్ఖానాలుగా మార్చి పని గంటలు లేకుండా పని చేయించుకుంటున్నారు. వారికి లభించే వేతనం కూడా తక్కువగా ఉండగా... ఆకు, తంబాకులో కూడా కోత విధించి నష్టానికి గురిచేస్తున్నారు. ఇలా ఏ రంగంలో చూసినా కార్మికులు కష్టాలనే అనుభవిస్తున్నారు.

రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించింది

రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యుడు ఆనంద్


సమావేశంలో మాట్లాడుతున్న ఆహారభద్రత కమిషన్ సభ్యుడు ఆనంద్

ఇల్లంతకుంట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం అందరికి సమాన హక్కులు కల్పించిందని రాష్ట్ర ఆహారభద్రత కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ పేర్కొన్నారు. మండలంలోని గాలిపెల్లి గ్రామంలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరు సమానం అని, ఎవరైనా వివక్షకు గురైతే చట్టం రక్షణ కల్పిస్తుందన్నారు. వెనుకబడిన వర్గాల ప్రజల సంక్షేమం కోసం రిజర్వేషన్ల విధానం అమలులో ఉందన్నారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో కొంత మందిని తక్కువగా చూడటం బాధాకరమన్నారు.

ప్రతినెలా గ్రామాల్లో పౌరహక్కుల దినోత్సవాలను ఏర్పాటు చే యడమే కాకుండా మండలస్థాయి అధికారులు హాజరుకావాలని, సమస్యలు అడిగి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో శశికళ, ఏఎస్ఐ ఫసియొద్దీన్, ఏఈవో అర్చన, పంచాయతీ కార్యదర్శి అనీల్, ఎమ్మార్పీఎస్ నాయకులు పసుల బాలరాజు, గుండ్రెడ్డి రాజు, బట్టు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంచలనాత్మక ఫలితాలకు నిర్వచనం అల్ఫోర్స్


విద్యార్థులతో కలిసి విజయసంకేతం చూపుతున్న అల్ఫోర్స్ చైర్మన్ వి నరేందర్‌రెడ్డి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సంచలనాత్మక ఫలితాలకు నిర్వచనం అల్ఫోర్స్ విద్యా సంస్థలని, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదోతరగతి ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినందన సభను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్ష ఏదైనా ఫలితం ఏదైనా అగ్రస్థానం అల్ఫోర్స్‌దేనని మరోసారి నిరూపించామన్నారు. విద్యార్థులకు వార్షిక ప్రణాళిక ప్రారంభంలోనే సూచనలు చేస్తామని, విద్యార్థుల్లో విజయ రహస్యాన్ని పెంపొందిస్తామని అన్నారు. ఎస్ఎస్‌సీ ఫలితాల్లో తమ పాఠశాలలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ మార్కులతో ప్రతిభకనబరిచినట్లు చెప్పారు. విద్యార్థులు బి. సాత్విక్ 589, ఎ.విష్ణు ప్రియ, కె.శివరాణి 588, కె.ఐశ్వర్య 587, ఎన్. సాత్విక్, ఎ.అన్విత్ 586, వి. అక్షర, జి.సహస్ర, సీహెచ్ ఆశ్రయ, టి.చరణ్ కుమార్, వి.అక్షర 585, టి.అక్షర, జి.శ్రీమేధా, వి.శివ చరణ్, పి. గణేశ్, ఎన్. మధుశాలిని, కె.వినయ్ 584, ఎన్. నేహా, టి.నిత్య, జి.అఖిలారెడ్డి, కె .ప్రణయ్, పి అఖిల్‌రావు 583, జి.సహజ 582, డి.విశ్వతేజ, కె.శోభన, కె .అలియా, ఎం.హర్షి, జి.ఐశ్వర్య, టి. కిషోర్ 581, ఎం.శృతికీర్తి, ఎండీ ముఖీత్, ఎఆర్. మౌనిమా, కె.సహస్రరెడ్డి, వి.బృహతి, ఎ.రంజిత్ రెడ్డి, కె. సుకృతి 580 మార్కులు సాధించారని తెలిపారు. అలాగే 1140 మంది విద్యార్థులకు 861 మంది విద్యార్థులు 500 మార్కులకుపై, 35 మంది విద్యార్థులు 580పై, 110 మంది విద్యార్థులు 570పై, 341 మంది విద్యార్థులు 550పై మార్కులు సాధించినట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన అల్ఫోర్స్‌ను అగ్రగామిగా నిలిపిన విద్యార్థులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అల్ఫోర్స్ పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యం

బి.సాత్విక్, 589 మార్కులు



ఐఐటీలో సీటు సాధించి కంప్యూటర్ సైన్స్ చేయాలనేది నా లక్ష్యం. అందుకు ఇప్పటి నుంచే కష్టపడి చదువుతున్నాను. మా స్కూలు టీచర్లు చాలాబాగా పాఠాలు చెప్పారు. టీచర్లు, తల్లిదండ్రులు నన్ను ఎంతగానో ప్రోత్సహించారు.

పదోతరగతి ఫలితాల్లో ట్రినిటి విజయ భేరి

592 మార్కులు సాధించిన బొడ్డు కార్తీక్


విద్యార్థులను అభినందిస్తున్న ట్రినిటి విద్యా సంస్థల వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభు త్వం బుధవారం ప్రకటించిన పదో తరగతి పరీక్షల ఫలితాల్లో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ట్రినిటి పాఠశాల విద్యార్థులు విజయ భేరి మోగించారు. ట్రినిటి మోడల్ సెకండరీ స్కూల్‌కు చెందిన బొడ్డు కార్తీక్ 592 మార్కులు సాధించి రాష్ట్రంలో 5వ స్థానంతో పాటు ఉత్తర తెలంగాణ టాపర్‌గా నిలిచారు. గర్రెపల్లి శివ సాయిక్రిషిత 591 మార్కులు, పైడి అక్షర 586 మార్కులు, రేణికుంట కృతిక 586 మార్కులు సాధించారు.

గడ్డం మేఘన 584 మార్కులు, గాదం అన్విక 583 మార్కులు, పొల్సాని అశ్విత 582 మార్కులు, దుర్గం అశ్విత 582 మార్కులు, పాటిబండ్ల వెన్నెల 581 మార్కులు, జల్లెల స్మరణ్ యాదవ్ 581 మార్కులు, దుగ్యాల అహరి 580 మార్కులు, ఊదరి ప్రణవి 580 మార్కులు, సయ్యద్ అదీన్ సూఫీ 580 మార్కులు, మర్కు ప్రజ్వల్ 580 మార్కులు, తలకంటి తనీష్‌రెడ్డి 580 మార్కు లు సాధించారు. ఒర్రె సాహితీ 584 మార్కులు, చిప్ప సాత్విక్ 581 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ట్రినిటి విద్యాసంస్థల వ్యవస్థాపకు డు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి టాపర్లను అభినందించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన బొడ్డు కార్తీక్ 592 మా ర్కులు, గర్రెపల్లి శివ సాయికృష్ణ 591 మార్కులు సాధించి ఉత్తర తెలంగాణ జిల్లాల్లో టాపర్‌గా నిలవడం గర్వ కారణమన్నారు. కొన్నేళ్లుగా ట్రినిటి విద్యాసంస్థల ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తూ ఎంతో మందిని డాక్టర్లు, ఇంజనీర్లుగా, విద్యావంతులుగా తీర్చిదిద్దామన్నారు. తమ విద్యాసంస్థలపై విద్యార్థుల తల్లితండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్ది ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నామని దాసరి మనోహర్ రెడ్డి తెలిపారు.

పదోతరగతి ఫలితాల్లో పారమిత విద్యార్థుల సత్తా


విద్యార్థులతో కలిసి విజయసంకేతం చూపుతున్న పారమిత పాఠశాల అధినేత డాక్టర్ ఇ ప్రసాదరావు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో కరీంనగర్ పారమిత పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. పాఠశాలకు చెందిన రామోజుల సాయిశ్వర్ 577 మార్కులు, గంగిశ్ల సన్విత్‌రెడ్డి 573, ఉమ్మెంతల మనస్విని 571, అగస్త్య మహావీర 570 మార్కులతో టాపర్లుగా నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ బాలాజీ తెలిపారు. 550 ఆపైన మార్కులు 39 మంది, 500 మార్కులు ఆపై 131 మంది విద్యార్థుల తోపాటు 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల అధినేత డాక్టర్ ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, రాకేష్, ప్రాచీ, వినోద్‌రావు, వీయూఎం ప్రసాద్, టీఎస్వీ రమణ, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత ప్రసాద్, సమన్వయ కర్త శ్రీనాథ్, ఉపాధ్యాయులు అభినందించారు.

మానేరు విద్యార్థుల విజయఢంకా

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి ఫలితాల్లో కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు విజయఢంకా మోగించారు.

విద్యాసంస్థలకు చెందిన జి.లాస్యప్రియ 576, ఎస్.విష్ణుశ్రీ 575, జి.ప్రజ్ఞ 574, డి.మహిత, ఆర్.నందిత 566, ఎ.విక్రమ్ రాజ్ 563, పి.పవన్‌తేజ్ 562, డి.స్వరిత్ రాజ్ 560 మార్కులు సాధించినట్లు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి తెలిపారు. అలాగే 46 మంది 500 మార్కులకుపైగా, వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా అనంతరెడ్డితోపాటు విద్యా సంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.


విద్యార్థులతో కలిసి విజయ సంకేతం చూపుతున్న మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి

సిద్ధార్థ విద్యార్థుల ప్రభంజనం


విద్యార్థులను అభినందిస్తున్న సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ శ్రీపాల్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. పాఠశాలకు చెందిన 109 మంది విద్యార్థులు 550కిపైగా మార్కులు, 179 మంది 500 మార్కులకుపైగా సాధించినట్లు పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. అలాగే 584, 582, 581, 580, 579 మార్కులతో విద్యార్థులు టాపర్లుగా నిలిచినట్లు, వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను చైర్మన్ శ్రీపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

రెండో రోజు ప్రశాంతంగా ఎప్‌సెట్

2,789మందికి 2,642మంది హాజరు

తిమ్మాపూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా రెండో రోజు ఈఏపీసెట్(ఎప్‌సెట్)-2025 పరీక్షలు అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో బుధవారం ప్రశాంతంగా జరిగాయి. బుధవారం కేవలం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక్కసెషన్‌లో మాత్రమే పరీక్ష జరిగిం ది. తిరిగి మే2నుంచి 4వరకు ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు జరుగనున్నాయి. బుధవారం కరీంనగర్‌జోన్ పరిధిలో కరీంనగర్, హుజూరాబాద్, మంథని, జగిత్యాల్, సిద్దిపేటలో మొత్తం కలిపి 12 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. బుధవారం ఈఏపీసెట్ (ఎప్‌సెట్)-2025 పరీక్షలు ఒకే సెషన్లలో నిర్వహించారు. ఈ సెషన్‌లో 12కేంద్రాల్లో కలిపి 2,789 మంది విద్యార్థులకు గాను 2,642 మంది విద్యార్థులు పరీక్షకు(94.7%) హాజరు కాగా 147మంది హాజరు కాలేదని నిర్వాహకులు తెలిపారు.

కరీంనగర్‌లో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయండి

- స్టేడియంలో సింథటిక్ ట్రాక్ మంజూరు చేయండి
- శాతవాహన వర్సిటీలో మల్టీపర్పస్ హాల్ ఇవ్వండి
- కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు బండి సంజయ్ వినతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కోరారు. బుధవారం ఢిల్లీలో మాండవీయను కలిసి మూడు అంశాలపై చర్చించి, వినతిపత్రాలు అందజేశారు. ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి అత్యధిక మంది ప్రజలు వైద్యం కోసం కరీంనగర్‌కు విచ్చేస్తున్నారని తెలిపారు. ఉత్తర తెలంగాణలో బీడీ కార్మికులు, నేత కార్మికులు సహా వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సంఖ్య అధికంగా ఉందన్నారు. ఈ సౌకర్యం అందు బాటులో లేకపోవడంతో ఎంతో మంది కార్మికులు వైద్య చికిత్సకు నోచుకోకుండా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. అలాగే, కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో రూ.10 కోట్ల వ్యయంతో సింథటిక్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. శాతవాహన వర్సిటీలో "ఖేలో ఇండియా" కింద మల్టీపర్పస్ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికోసం రూ.16 కోట్ల వ్యయంతో ప్రతి పాదనలు కేంద్రానికి పంపిన విషయాన్ని గుర్తు చేశారు. ఇటీవలే స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు వర్సిటీని సందర్శించారని తెలిపారు. కాగా, కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని, ఈఎస్ఐ ఆస్పత్రి ప్రతిపాదనను పీఎంవోకు పంపారని, సింథటిక్ ట్రాకుల ఏర్పాటు అంశాలపైనా త్వరగా సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని సంబంధించి అధికారులను ఆదేశించారని బండి సంజయ్ ప్రకటనలో వెల్లడించారు.


కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు

రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మహాత్మా జ్యోతిబాఫూలే బీసీ గురుకులం, మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు.

సుల్తానాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్ మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యార్థులు టాపర్స్‌గా నిలిచారు. ఈ స్కూల్‌కు చెందిన వంగరి ప్రేమ్‌తేజ 600 మార్కులకు గాను 582 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచారు. ఇదే పాఠశాలకు చెందిన ఎల్లాల మోక్షిత్ అనే విద్యార్థి 574 మార్కులు సాధించాడు. సుల్తానాబాద్ లోని సాంఘిక


వంగరి ప్రేమ్‌తేజ్

సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలకు చెందిన గెల్లు శివచరణ్ 567 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ రాజేశం తెలిపారు. గర్రెపల్లిలోని మోడల్ స్కూల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. శివప్రసాద్ 564, శ్రీనిధి 554, శివమణి 548, సంజన 541, చంద్రబాను సుహాస్ 535 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ గోల్డి బల్‌బీర్ కౌర్ తెలిపారు. భూపతిపూర్‌లోని కస్తూర్బా స్కూల్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారని, ఆర్కుటి శ్రీప్రణవి 561 మార్కులు, కీర్తిప్రియ 542 మార్కులు సాధించారని స్పెషల్ ఆఫీసర్ స్వప్న తెలిపారు.

● మండలంలో పదో తరగతి పరీక్షలలో 98.67 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈవో ఆరెపల్లి రాజయ్య తెలిపారు. 526 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 519 మంది ఉత్తీర్ణత సాధించారు.

● సుల్తానాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ స్కూల్ విద్యార్థి బొజ్జ సాత్విక్ 600 మార్కులకు గాను 589 మార్కులు సాధించాడు. 114 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారని అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 16 మంది విద్యార్థులు 580 కి పైగా మార్కులు సాధించారని, మరో 54 మంది 550 కి పైగా మార్కులు తెచ్చుకున్నారని వివరించారు. ఆకుల విష్ణుప్రియ 588, కర్రి ఐశ్వర్య 587, తన్నీరు చరణ్ 587,అక్షర 585,మధుశాలిని 584, కర్రె వినయ్ 584, గోపిడి అఖిలారెడ్డి 583, కోటగిరి ప్రణయ్ 583, పోల్సాని అఖిల్‌రావు 583, గన్నమనేని ఐశ్వర్య, తూముల కిషోర్ 581, ఊర సహస్రరెడ్డి, వీరగోని బృహస్పతి, అర్రం రంజిత్ రెడ్డి, కోడం సుకృతి 580 మార్కులు సాధించారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాల మోడల్ స్కూల్ విద్యార్థిని వర్షిణి 600 మార్కులకు గాను 564మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. అదే పాఠశాలకు చెందిన కావ్యకు 563, వేదప్రియకు 561 మార్కులు వచ్చాయి. మండలంలో 309మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 302మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. మోడల్ స్కూల్‌లో తొమ్మిది మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారు.


వర్షిణి

ఎలిగేడు: ఎలిగేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని కోడూరి సాహిత్య 549 మార్కులతో మండల్ టాపర్‌గా నిలిచింది. ఇజ్జగిరి ప్రణవి (సుల్తాన్‌పూర్)516మార్కులు, రామ్‌చరణ్ 509 మార్కులు(ధూళికట్ట) సాధించారు. మండలంలో మూడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 69 మందికి గాను అందరు ఉత్తీర్ణులయ్యారు.


కోడూరి సాహిత్య

పాలకుర్తి: మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో 95 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కన్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 17 మంది విద్యార్థులకు గానూ 16 మంది ఉత్తీర్ణత సాధించారు. పుష్పాల వైష్ణవి అనే విద్యార్థిని 600 మార్కులకు 547 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచా రు. జయ్యారంలో 30 మందికి కాను 30 మంది ఉత్తీర్ణత సాధించారు. పి సాత్విక అనే విద్యార్థిని 528 మార్కులు సాధించి ంది. ఈసాలతక్కళ్లపల్లి లో ఏడుగురికి ఐదుగురు ఉత్తీర్ణత సాధాంచారు. కుక్కల గూడూర్‌లో 25 మందికి 25 మంది ఉత్తీర్ణత సాధించారు. బసంత్‌నగర్‌లో 30కి 27 మంది ఉత్తీర్ణత సాధించగా టి అఖిల అనే విద్యార్థిని 541 మార్కులు సాధించింది. పాలకుర్తిలో ఇద్దరు విద్యార్థులు పరీక్ష రాయగా ఇద్దరు పాసయ్యారు. ఎఫ్‌సీఐలో 25 మందికి 22 మంది ఉత్తీర్ణత సాధించ గా కస్తూరి వైష్ణవి అనే విద్యార్థిని 529 మార్కులు సాధించింది. పాలకుర్తి కేజీబీవీలో 40 మంది విద్యార్థులు పరీక్ష రాయగా వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. కోల సాత్విక అనే విద్యార్థిని 545 మార్కులు సాధించింది.


పుష్పాల వైష్ణవి

కోల్‌సిటీటౌన్: బుధవారం విడుదలయిన పదవతరగతి వార్షిక పరీక్షా ఫలితాల్లో గోదావరిఖనికి చెందిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. స్థానిక కృష్ణవేణి విద్యాసంస్థలలో బి.శ్రీనిల్యా 578 మార్కులు, జి.కార్తీకా 571, జి.వైష్ణవి 568 మార్కులు సాధించారు. 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం సంతోషకరమని బుధవారం పాఠశాల ఆవరణలో జరిగిన అభినందన కార్యక్రమంలో విద్యాసంస్థ డైరెక్టర్ మంజులా శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. స్థానిక నారాయణ పాఠశాలలో గౌతం చరణ్ 584, యశ్వంత్ 572, హరిణి 570, ఎ వైష్ణవి 568 మార్కులు సాధించారు. విద్యార్థులను ఏజీఎం చైతన్యరావు, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు. స్థానిక గుడ్ మార్నింగ్ గ్రామర్ హైస్కూల్‌కు చెందిన ముత్యాల హర్షవర్ధన్ 567, ఐలవేణి ప్రన్‌ప్రతాప్ 554, సిరితేజ 545, కుమ్మరికుంట వర్షిణి542, సిరిపెల్లి దీక్షిత 532, రేసు అక్షయ్ 530 మార్కులు సాధించారు. పాఠశాల కరస్పాండెంట్ అదర్‌సండే సమ్మారావు, ప్రిన్సిపల్ చందుపట్ల తిరుపతిరెడ్డి, డైరెక్టర్ ఊర సమ్మిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. స్థానిక సప్తగిరికాలనీలోని మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి కోడూరి అనిల్‌కుమార్ 545, తోకల మనోజ్‌వర్మ 536, వద్నాల 533 మార్కులతో పాటు 45 మంది విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ గుల్బం శ్రీధర్, పాఠశాల కోఆర్డినేటర్ రమేష్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు. స్థానిక సిద్ధార హైస్కూల్‌కు చెందిన కె శ్రావిక 564, హుమీరాతరానుమ్544, అర్భా నాజ్ 538, కె.సాక్షర, జీనత్ 537 మార్కులు సాధించారు.


బి శ్రీనిల్యా

గోదావరిఖని: కాలనీ పరిధిలోని డీఏవీ స్పేస్(శాంతినికేతన్) విద్యార్థులు శ్రీవినయ 581, శ్రీవాస్తవ్ 580 మార్కులు సాధించారు. స్పందన మోడల్ స్కూల్‌కు చెందిన ఆర్ తనయ 575, భానుశ్రేయ 567 మార్కులు సాధించారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెంది న సాత్విక 563, హర్షిత 561 మార్కులు సాధించారు. సింగరేణి స్కూల్‌కు చెందిన అక్షర 556, పవన్‌కుమార్ 526, హర్ష 525 మార్కులు సాధించగా న్యూమారేడుపాక ప్రభుత్వ పాఠశాలకు చెందిన శ్రీవర్షిణి 510 మార్కులు సాధించారు.

మంథని: స్థానిక బాయ్స్ హైస్కూల్ విద్యార్థి సుతారి సాత్విక్‌రాజ్ 562, బెరా ఆదిత్య తేజ 561, జెడ్‌పిహెచ్‌ఎస్ గర్ల్స్‌లో విద్యార్థిని అవధానుల సంజన 561, ఎగ్లాస్‌పూ ర్ జడ్పీహెచ్‌ఎస్, విద్యా ర్థిని లక్ష్మీప్రసన్న 544, హిందూ 530, అక్షయ 509, స్నేహ 521, గుంజపడుగు జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని రిషిత 530, రవీకుమార్ 528, కన్నాల జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని చరణ్‌తేజ 520, ఆరెంద జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి బండారి సిరి 510, జనగామ రామ్‌చరణ్ 503 సాదించారు. స్థానిక సాంఘిక గురుకుల పాఠశాలకు చెందిన అజేయ్‌కుమార్ 573, అభినవ్ 566, బార్గవ్ 562 మార్కులు సాదించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనాథ్ తెలిపారు. మంథని కృష్ణవేణి హైస్కూల్‌కు విద్యార్థి కటకం లక్ష్మీ సూర్యభరత్ 576, కాకతీయ హైస్కూల్‌కు చెందిన దుర్గం త్రేక్ష 579 మార్కులు సాధించారు.


సాత్విక్‌రాజ్


సంజన

రామగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 94 శాతం ఉత్తీర్ణత శాతం సాధించారు. మండలంలోని ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 167 మంది విద్యార్థుల్లో 158 శాతం ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీ పాఠశాల విద్యార్థిని సిరిపురం శ్రీజ, ఎస్ వర్షిత 580 మార్కులు సాధించారు. బేగంపేట్ జడ్పీ పాఠశాలకు చెందిన రషిత 558 మార్కులు, చందనాపూర్ పాఠశాలకు చెందిన శ్రీజ 557 మార్కులు సాధించారు.


వర్షిత

ముత్తారం: ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో కస్తూర్బా విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. 100 శాతం ఉత్తీర్ణతతో మండలంలో మొదటి స్థానంలో నిలిచింది. శ్రీ వైష్ణవి 600మార్కులకు గాను 557మార్కులు సాధించింది. పోతారం మోడల్ స్కూల్ విద్యార్థిని స్వాతి 547 మార్కులు, పోతారం జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని రక్షిత 493, లక్కారం జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని సంయుక్త 521 మార్కులు సాధించారు.


శ్రీవైష్ణవి

జూలపల్లి: మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని పాటకుల అశ్విత 568 మార్కులు సాధించింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని గుంటి అనూష 560 మార్కులు, జూపిటర్ పాఠశాలకు చెందిన న్యాడం లక్ష్మీరిత్విక 555 మార్కులు సాధించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంతో మండల విద్యాధికారి సరస్వతి, ఆయా పాఠశాలల ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేసారు.


పి అశ్విత

ధర్మారం: మండలంలోని సాయి మణికంఠ మోడ్రన్ హైస్కూల్ విద్యార్థి డి హర్షవర్ధన్ 574, బ్రిలియంట్ మోడల్ స్కూల్ చెందిన వి జశ్వంత్ 573, మేడారం సోషల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థిని బి నవిత 568, ఆదర్శ పాఠశాల విద్యార్థి సిద్దార్థ 566 మార్కులు సాధించారు. 17 పాఠశాల నుంచి 746 మంది విద్యార్థులకు గానూ 731 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు.


బి నవిత

ఆడిట్ నిర్వహణకు దరఖాస్తులు సమర్పించాలి

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మున్సిపల్ రికార్డుల ఆడిట్ నిర్వహణకు ఆసక్తి గల ఆడిటర్లు మే 8 లోపు దరఖాస్తులు సమర్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న రామగుండం నగరపాలక సంస్థతో పాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలోని ఏరియా లెవెల్ ఫెడరేషన్, టౌన్ లెవెల్ ఫెడరేషన్‌కు సంబంధించిన రికార్డులను ఆడిట్ చేయడానికి ఆసక్తి, అర్హత కలిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఆడిటర్లు పూర్తి వివరాలతో పాటు తగిన ధ్రువీకరణ పత్రాలను జతచేస్తూ దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. దరఖాస్తులను పథక సంచాలకులు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ వారి కార్యాలయంలో మే 8లోపు సమర్పించాలని, ఇతర వివరాలకు సెల్ నంబర్ 6304894960లో సంప్రదించాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక సమ్మర్ క్లాసులు

ఎలిగేడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ఎస్సీ కాలనీలోని పాఠశాలల్లో మే 5వ తేదీ నుంచి 10వరకు సమ్మర్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం గంద్ర దేవేందర్‌రావు, పంచాయతీ కార్యదర్శి అంజలి తెలిపారు. మొదటి తరగతి నుంచి ఏడో తరగతి విద్యార్థులకు ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు క్లాసులు ఉంటాయని తెలిపారు. బాలబాలికలకు తెలుగు, ఇంగ్లీష్, గణితంలో బేసిక్ స్కిల్స్ నేర్పుతామని తెలిపారు.

గాలి దుమారం.. విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంథని, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మంథని ప్రాంతంలో బుధవారం సాయంత్రం తీవ్రంగా గాలి దుమారం వీచింది. దాదాపు గంటపాటు వీచిన గాలి దుమారానికి మంథని పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో పలు చోట్ల చెట్లు నేల కూలాయి. కూలిన చెట్లు విద్యుత్ లైన్లపై పడడంతో సాయంత్రం ఆరుగంటల నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మబ్బులు, గాలి దుమారం, చిరు జల్లులతో గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వచేసిన రైతులు ఆందోళన చెందారు. ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకున్నారు. విద్యుత్‌లైన్‌ల పై పడిన చెట్లను తొలగింపునకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

పది ఫలితాల్లో 'గాయత్రి విద్యానికేతన్' విద్యార్థుల ప్రతిభ

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు వందకు వంద శాతం ఫలితాలను సాధించారు. ఉప్పు వైష్ణవి 572 మార్కులు, బొజ్జ అక్షర 557 మార్కులు, బొంకూరి విష్ణు 542, మారం శ్రావ్య 542 మార్కులు, షిఫానా అంజుమ్ 537 మార్కులు, చింతల లక్ష్మీశ్రీ 535 మార్కులు, గంట సందీప్ 534 మార్కులు, గాండ్ల అనురాగ్ 512 మార్కులు, కంచి శివసాయి 504 మార్కులు సాధించి స్కూల్‌లో టాపర్లుగా నిలిచారు. ఈ సందర్భంగా టాపర్లను, ఉపాధ్యాయులను గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ దేవి, ప్రిన్సిపాల్ విజయ్, రుజియోద్దీన్, మహేష్ టాపర్లను అభినందించారు.

కోల్ లారీ లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీ రేట్లు పెంపు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కోల్ లోడింగ్, అన్ లోడింగ్, టార్పాలిన్ హమాలీలకు కూలీ రేట్లు పెరినట్టు ఆ సంఘం అధ్యక్షుడు డప్పు మల్లేష్, ప్రధాన కార్యదర్శి గండు తిరుపతి తెలిపారు. బుధవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 10టైర్ల లారీకి రూ.410, 12టైర్ల లారీకి రూ.520, 6టైర్ల లారీకి రూ.360కి పెంచినట్టు, ఈ ధరలు మేడే నుంచి అమలులోకి వస్తాయని తెలిపారు.

ఘనంగా పరుశరాముడి జయంతి వేడుకలు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పశురాంనగర్‌లో బుధవారం బండి రాము ఆధ్వర్యంలో పరుశరాముని జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హాజరై పరుశరాముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొంతల రాజేష్, పెద్దెల్లి ప్రకాష్, తౌటం సతీష్, తాళ్లపల్లి యుగంధర్, దాసరి విజయ్, దూళికట్ట సతీష్, ఉదయ్ రాజ్ పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన అధికారికి సన్మానం

గోదావరిఖని, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎంగా విధులు నిర్వహిస్తున్న కేహెచ్ గుప్త బుధవారం పదవీ విరమణ పొందగా ఆర్‌జీ-1 జీఎం కార్యలయంలో జీఎం డీ లలిత్ కుమార్, కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ పూలమాలలు శాలువాలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అధికారులు రవి కుమార్, గోపాల్ సింగ్, డి.వి.రావు, కిరణ్ బాబు, కోలా మల్లేష్, ఏఐటీయూసీ ప్రతినిధి రాజు, రవీందర్ రెడ్డి, హనుమంత రావు పాల్గొన్నారు.

ఎలిగేడు బంద్ ప్రశాంతం

ఎలిగేడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో హిందూ పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడులకు వ్యతిరేకంగా ఎలిగేడు మండల కేంద్రంతో పాటు ధూళికట్ట, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం బంద్ నిర్వహించారు. వాణిజ్య, వ్యాపార వేత్తలు బంద్‌కు సహకరించారు. అమరులకు సంతాపం ప్రకటించారు. అనంతరం అంబేద్కర్ చౌక్‌లో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా నాయకులు గర్రెపల్లి నారాయణస్వామి, గాదె రంజిత్‌రెడ్డి, గుజ్జుల మల్లారెడ్డి, మల్లారపు అంజయ్య, అడ్డగుంట తిరుపతిగౌడ్, కొత్తిరెడ్డి వేణు గోపాల్‌రెడ్డి, అమరగండ గంగయ్య, రాయపాక మనోహన్, గోపు సురేందర్‌రెడ్డి, ఎర్రోళ్ల మల్లేశం, పర్శరాంగౌడ్ పాల్గొన్నారు.


ఎలిగేడులో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

రోడ్డుప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

సీపీ అంబర్ కిశోర్ ఝూ


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝూ

కోల్‌సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, రోడ్డు సేఫ్టీ విభాగంతో కలిసి పని చేయాలని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝూ పేర్కొన్నారు. బుధవారం కమిషనరేట్‌లో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీస్ అధికారులతో ఆయన క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లు, డివిజన్లు, జోన్ల వారీగా పెడింగ్ కేసులకు సంబంధించి నేరస్థుల అరెస్టు, విచారణ, చార్జిషీట్లు, తదితర స్థితి గతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, ఏసీపీ మల్లారెడ్డి, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతి బాధ్యతలను పెంచుతుంది

కోల్‌సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖలో పదోన్నతులతో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని రామగుండం సీపీ అంబర్‌కిశోర్ ఝూ అన్నారు. కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్‌లలో పనిచేస్తున్న ఏఎస్‌ఐలు సయ్యద్ ముజారుద్దీన్, అబ్దుల్ మునీర్ అహ్మద్, రాజన్న, ఆర్‌వీకే లాల్ ఎస్‌ఐలుగా పదో న్నతి పొందగా బుధవారం కమిషనరేట్‌లో వారిని అభినందించి ర్యాంకు పదోన్నతి చిహ్నాన్ని అలంకరించారు. చట్ట పరిధిలో ప్రజలకు న్యాయం అందించేందుకు కృషి చేసినప్పుడే పోలీస్‌శాఖ కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయని తెలిపారు.

రామగుండం పేరు చెడగొట్టాలని చూస్తే.. సహించేది లేదు

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రామగుండం ప్రతిష్టకు భంగం కలిగించినా, ఈ ప్రాంతానికి నష్టం చేయాలని చూసినా సహించేది లేదని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హెచ్చరించారు. బుధవారం గోదావరిఖనికి చెందిన ప్రైవేట్ వైద్యులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల గోదావరిఖనిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో డీఎంహెచ్‌వో కలెక్టర్ పంపారని తనిఖీకి వచ్చారని, తనిఖీ చేసి నివేదికను కలెక్టర్‌కు ఇస్తే బాగుండేదన్నారు. కానీ స్కానింగ్ మిషన్‌కు ఎన్‌ఓసీ అంశంలో వైద్యులు, ఆసుపత్రి ప్రతిష్టకు భంగం కలిగేలా వృత్తినే అవమానించేలా సదరు అధికారి ప్రవర్తించారన్నారు.

అనంతరం ఐఎంఏ అధ్యక్షుడు క్యాస శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరు నెలలుగా డీఎంహెచ్‌వో రామగుండం ప్రాంత వైద్యులను వేధిస్తున్నారని, చిన్నచిన్న కారణాలు చెప్పి జరిమానాలు విధిస్తున్నారన్నారు. తాము వామన్‌రావు దంపతులను చంపినట్టు చంపుతామని బెదిరించామని చెప్పడం పూర్తిగా అబద్ధమన్నారు. సమావేశంలో మాజీ మేయర్, ప్రముఖ వైద్యులు అనీల్‌కుమార్, డాక్టర్ నాగిరెడ్డి, లక్ష్మీవాణి, మడికల్ అసోసియేషన్ ప్రతినిధులు రాజేందర్, భిక్షపతి పాల్గొన్నారు.

● **విగ్రహ ప్రతిష్ఠాపన..**

కళ్యాణ్‌నగర్: రామగుండం ప్రజలను పోతరాజు సహిత పోచమ్మ చల్లగా చూడాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, మనాలీ ఠాకూర్ దంపతులు వేడుకున్నారు. బుధవారం బాహుజీనగర్‌లో మాజీ కార్పొరేటర్ మహంకాళి స్వామి, రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్మించిన పోచమ్మ విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే దంపతులు హాజరై హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

గోదావరిఖని: అంతర్గాం మండల పరిధిలోని అక్బర్‌నగర్‌లో ఎన్టీపీసీ యాష్ పాండ్ పైపులైన్ పగిలి ఇళ్లలోకి బూడిద నీరు చేరి కాలనీ మొత్తం ఇటీవల జలమయం అయింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ బుధవారం అక్బర్‌నగర్‌ను సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ప్రమాదానికి కారణమైన పైప్‌లైన్‌ను పరిశీలించి ఎమ్మెల్యే మాట్లాడారు. బూడిదతో నష్టపోయిన ఇళ్ల వెనకాల రక్షణ గోడ నిర్మించి మరోసారి ఇలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఎన్టీపీసీ అధికారులను ఆదేశించారు. బూడిద బాధిత కుటుంబాలకు ఉపాధి కల్పించాలని కోరారు. స్లాబ్ ఇల్లు నిర్మించుకోవడానికి సిద్ధమైతే తాను ఇందిరమ్మ పథకంలో భాగంగా రూ.5లక్షలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అయోధ్యసింగ్, దీటి బాలరాజు, షేక్ ఇఫ్తేకార్ అహ్మద్, ఏబీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాజియా సుల్తానా, ముంతాజ్, ఈదునూరి హరిప్రసాద్, సింగం కిరణ్ గౌడ్, అప్పాసి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏప్రిల్ నెల ఆర్జీ-2 ఉత్పత్తి 219 శాతం

గోదావరిఖని, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఏప్రిల్ నెలలో ఆర్జీ-2 ఏరియా 219 శాతం బొగ్గు ఉత్పత్తి చేసినట్టు జీఎం బండి వెంకటయ్య తెలిపారు. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఉత్పత్తి వివరాలను తెలిపారు. ఏప్రిల్ నెలకు ఏరియాకు నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 2,28,400 టన్నులకు గాను 4,99,990 టన్నులు (219%) సాధించినట్టు జీఎం తెలిపారు. ఓబీ వెలికితీత లక్ష్యం 55 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 60.41 లక్షల క్యూబిక్ మీటర్లు వెలికితీసి(110%) సాధించినట్టు జీఎం పేర్కొన్నారు. సీహెచ్‌పీ ద్వారా 8,95,936 టన్నుల బొగ్గును రవాణా చేసినట్టు తెలిపారు. ఓసీపీ-3 ప్రాజెక్టు టార్గెట్ రెండు లక్షల టన్నులు కాగా 4.88 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి(244%) జరిగినట్టు పేర్కొన్నారు. వకీల్‌పల్లె గని టార్గెట్ 28,400కు గాను 11,773(41%) బొగ్గు ఉత్పత్తి జరిగినట్టు జీఎం తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని బొగ్గు ఉత్పత్తికి ఆటం కాలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈఆర్థిక సంవత్సరంలో గడువు కంటే ముందుగానే లక్ష్యాన్ని సాధించేలా ముందుకు వెళ్తున్న ట్టు తెలిపారు. అధికారులు నరసింహా రావు, రాముడు, ఎర్రన్న, అనిల్‌కుమార్, మురళీకృష్ణ, వెంకట రామచంద్ర పాల్గొన్నారు.

బీఎంఎస్ కృషితోనే జనరల్ మజ్దూర్ డిజిగ్నేషన్ మార్పు

గోదావరిఖని, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బీఎంఎస్ కృషి ఫలితంగా జనరల్ మజ్దూర్ డిజిగ్నేషన్ మార్పు జరిగినట్టు సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జేబీసీసీఐ సమావేశాలతో పాటు స్టాండర్డైజేషన్ కమిటీ సమావేశాల్లో బీఎంఎస్ కోల్ ఇండియా, సింగరేణి యాజమాన్యాలతో చర్చించి డిజిగ్నేషన్ పేరు మార్చేలా ఒప్పించిటనట్టు తెలిపారు. మజ్దూర్ అనే పదం ఉన్న ప్రతి డిజిగ్నేషన్ మార్పు కోరుతూ త్వరలో జరగనున్న స్టాండర్డ్ డైజేషన్ సమావేశంలో యాజమాన్యంతో చర్చిస్తామని సత్తయ్య పేర్కొన్నారు.

సింగరేణి కాలనీలను సుందరంగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే

గోదావరిఖని, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 పరిధిలోని సింగరేణి కాలనీలను సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. బుధవారం రూ.5కోట్లతో 23కిలో మీటర్ల రోడ్ల నిర్మాణానికి ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్‌తో కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సింగరేణి కాలనీల్లో 40సంవత్సరాల క్రితం వేసిన రోడ్లే ఇప్పటివరకు ఉన్నాయని, అవి గుంతల మయమై కార్మికులు నడవడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. రోడ్ల నిర్మాణం చేయాలని సింగరేణి సీఎండీ బలరాంనాయక్ దృష్టికి తీసుకెళ్లగా కాలనీల్లో అంతర్గత బీటీ రోడ్లకు రూ.5కోట్లు మంజూరు చేశారని ఆయన చెప్పారు. సింగరేణి స్టేడియంను కూడా త్వరలో ఆధునీకరించేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సింగరే ణి అధికారులు కిరణ్‌బాబు, వరప్రసాద్, వసంత్‌కుమార్, కార్పొరేటర్లు బొంతల రాజేష్, పెద్దెల్లి తేజస్విని ప్రకాష్, ముస్తాఫా, తిప్పారపు శ్రీనివాస్, తౌటం సతీష్, యుగంధర్, సాంబమూర్తి, సింహాచలం, దూళికట్ట సతీష్, ఉదయ్‌రాజ్ పాల్గొన్నారు.


బీటీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



గుర్తింపు సంఘంతో స్ట్రక్చర్ సమావేశం

గోదావరిఖని ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గుర్తింపు సంఘం నాయకులతో ఆర్జీ-1, ఆర్జీ-2 జీఎంలు లలిత్ కుమార్, వెంకటయ్య స్ట్రక్చర్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూ సీ నాయకులు పలు సమస్యలను ప్రస్తావించారు. నాయకుల ప్రతిపాదనలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని జీఎంలు పేర్కొన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోశం, స్ట్రక్చర్ కమిటీ సభ్యులు రాజారత్నం, జిగురు రవీందర్, శ్యాంసన్, సాంబశివరావు, రవికుమార్, మహేందర్, అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌జీ-1 ఏరియాలో ఉచిత వేసవి శిక్షణ ప్రారంభం

గోదావరిఖని, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్‌జీ-1 ఏరియాలో సింగరేణి ఉద్యోగుల పిల్లలకు, మాజీ ఉద్యోగుల పిల్లలకు, పరిసర ప్రభావిత ప్రాంత పిల్లలకు స్థానిక జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో బుధవారం ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ ప్రారంభించారు. పుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్, బాస్కెట్‌బాల్, ఆర్చరీ, బాక్సింగ్, కరాటేలకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) పర్సనల్ కిరణ్‌బాబు, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోశం పాల్గొన్నారు.

నిరుద్యోగుల శిక్షణ కోసం హైదరాబాద్‌కు తరలింపు

గోదావరిఖని, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్‌జీ-1 ఆధ్వర్యంలో గోదావరిఖని పరిసర ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు కోసం టెక్ మహీంద్రా స్కిల్ బిల్డింగ్ ప్రోగ్రామ్ ఉచిత శిక్షణ ఉద్యోగ నియామకం కోసం కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ హైదరాబాద్‌కు వెళుతున్న 18మంది అభ్యర్థుల బస్సును బుధవారం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తన క్యాంపు కార్యాలయంలో జెండా ఊపి ప్రారంభించారు. ఆర్‌జీ-1 జీఎం డీ లలిత్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.